బీఆర్ఎస్ సెంచరీ.. కేసీఆర్ హ్యాట్రిక్

హంగ్ కాదు.. బీఆర్ఎస్‌దే ముమ్మాటికీ హ్యాట్రిక్

- బీజేపీ డకౌట్, కాంగ్రెస్ రనౌట్ ఖాయం
- కేసీఆర్ అంటే నమ్మకం, విశ్వాసం..
- కాంగ్రెస్ అంటే నయవంచన, నాటకం
- మాటలు, మూటలు, మంటలు.. కాంగ్రెస్ కల్చర్
- కాంగ్రెస్ భస్మాసుర 'హస్తం'.. నమ్మితే ఆగమైతం..
- రేవంత్‌రెడ్డి మారని పార్టీ అంటూ ఉన్నదా?
- కాంగ్రెస్ పాలనపై చర్చపెట్టే హక్కు ఉన్నదా?
- జేపీ నడ్డా.. తెలంగాణ కేసీఆర్ అడ్డా గుర్తుపెట్టుకో
- ఈ సారి బీజేపీకి ఒక్క సీటు కూడా రాదు
- రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు

శనివారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని బాగారెడ్డి స్టేడియంలో నిర్వహించిన బహిరంగ సభకు హాజరైన జనం

మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలంలోని పడ్తనపల్లిలో ఎత్తిపోతల పథకం పనులను ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో విప్ సుమన్, ఎంపీ వెంకటేశ్ నేతకాని, ఎమ్మెల్యేలు దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య

మంచిర్యాల/సంగారెడ్డి, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు వంద సీట్లు ఖాయమని, వచ్చేది హంగ్‌లు.. గింగులు కాదని.. కేసీఆర్ హ్యాట్రిక్ పక్కా అని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ధీమా వ్యక్తంచేశారు. బీజేపీకి ఈసారి ఒక్క సీటుకూడా రాదని అన్నారు. కేసీఆర్ అంటే ఒక నమ్మకం.. కేసీఆర్ అంటే ఒక విశ్వాసం.. కాంగ్రెస్ అంటే నయవంచన.. నాటకం అని అభివర్ణించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు 'ఓడ దాటేదాక ఓడ మల్లప్ప.. ఓడ దాటినంక బోడ మల్లప్ప' అనే రకం అని ఎద్దేవా చేశారు. శనివారం ఆయన మంచిర్యాల జిల్లా దొనబండ బహిరంగ సభ, చెన్నూర్ అంబేద్కర్ చౌక్‌లో నిర్వహించిన రోడ్‌షోలో పాల్గొన్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలో పర్యటించారు. ఝరాసంగం, జహీరాబాద్‌లో పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇవాళ కళ్లబొల్లి మాటలు చెప్పి.. అరచేతిలో వైకుంఠం చూపించి.. కర్ణాటక నుంచి డబ్బు సంచులు తెచ్చి ఈ రాష్ట్రంలో గెలువాలని పగటి కలలు కంటున్నదని మండిపడ్డారు. సీఎం కేసీఆర్ ఉన్నంత కాలం తెలంగాణలో కాంగ్రెస్ నాటకాలు నడువవని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నన్ని రోజులు గ్రూపులు, ముఠా రాజకీయాలతో వాళ్లలో వారే తన్నుకొని పరిపాలనను భ్రష్టు పట్టించారని గుర్తుచేశారు. అధికారం కోసం తమ సొంత పార్టీ ముఖ్యమంత్రులను కుర్చీలోంచి దించి.. ఇంకొకరు కుర్చీ ఎక్కడం కోసం హైదరాబాద్‌లో మతకలహాలు సృష్టించి, కర్ఫ్యూలు పెట్టిన పార్టీ కాంగ్రెస్ అని మండిపడ్డారు. ఇవాళ కేసీఆర్ హయాం లో కాళేశ్వరం ప్రాజెక్ట్ కట్టినంక కరువు లేదని, తొమ్మిదిన్నర ఏండ్ల కేసీఆర్ కాలంలో కర్ఫ్యూ అంతకంటే లేదని తెలిపారు.

> సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం రూ. 2 వేల పింఛన్ ఇస్తున్నడా? లేదా?.. కల్యాణ లక్ష్మి కింద ఆడబిడ్డలకు రూ.లక్ష ఇస్తున్నడా? లేదా? రైతుబంధు ఎకరానికి రూ.4వేలు ఉండే.. మళ్లీ గెలిస్తే రూ.5వేలు చేస్తా అన్నడు. చేసిండా? లేదా? ఇట్లా ఇచ్చిన ప్రతిమాటా నెరవేర్చిండు. త్వరలోనే ప్రతిపక్షాల మైండ్ బ్లాక్ అయ్యే మ్యానిఫెస్టో మీ ముందుంటుంది. మూడోసారి ఎలాగూ మనమే గెలుస్తాం. ఇచ్చిన హామీలు నెరవేర్చుకుందాం.
> –మంత్రి హరీశ్‌రావు

చెప్పినవన్నీ చేసిచూపిన కేసీఆర్

కాంగ్రెస్ పార్టీ ఆ రోజు నక్సలైట్లతో చర్చలు అని చెప్పి, ఆ నక్సలైట్లను మట్టు పెట్టింది వాస్తవం కాదా? అని మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. ఆ పార్టీ ఏ విషయంలో మాట మీద ఉన్నదో చెప్పాలని ప్రశ్నించారు. 2009లో కాంగ్రెస్ పార్టీ గెలిస్తే 6 కిలోల బియ్యం, పగటి పూట కరెంట్, తండాలు గ్రామ పంచాయతీలు చేస్తామని మోసం చేసిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ ఒక భస్మాసుర హస్తమని, దాన్ని నమ్మితే ఆగమైతమని అన్నారు. కానీ కేసీఆర్ చెప్పిందల్లా చేసి చూపారని చెప్పారు. తెలంగాణ తెస్తా అని తెచ్చి చూపించారని, రైతుబంధు, ఉచిత కరెంట్ ఇస్తా అని చెప్పి ఇచ్చి మాట నిలబెట్టుకొన్నారని తెలిపారు. ఆనాడు కాంగ్రెస్ పార్టీ ఉచిత కరెంట్ అంటే ఉత్త కరెంట్ చేసిందని, రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఎరువుల బస్తాలు కావాలంటే పోలీస్‌స్టేషన్ల ముందు లైన్లలో నిల్చొండే దుస్థితి ఉండేదని గుర్తుచేశారు. మళ్లీ కాంగ్రెసోళ్లు వస్తే కాలిపోయే మోటర్లు, పేలిపోయే ట్రాన్స్‌ఫార్మర్లు, పగటిపూట కరెంట్, ఎరువు బస్తాలకు కొరత.. ఇలా అన్నింటికీ గోసపడాల్సిందేనని చెప్పారు.

జహీరాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మాణిక్‌రావును ప్రజలకు పరిచయం చేస్తున్న హరీశ్‌రావు

కాంగ్రెస్ పాలనకు, బీఆర్ఎస్ పాలనకు పొంతన ఉందా?

ఆనాటి పదేండ్ల కాంగ్రెస్ పాలనకు, ఈనాటి పదేండ్ల బీఆర్ఎస్ పాలనకు అసలు పొంతన ఉన్నదా? అని టీపీసీసీ చీఫ్ రేవంత్‌ను మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. ఈ రెండింటికీ నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉన్నదని చెప్పారు. ఆనాటి కాంగ్రెస్ పాలనలో ఎరువులు లేవు, కరెంట్ లేదు, తాగడానికి నీళ్లు లేవు, రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి లేవని పేర్కొన్నారు. అలాంటి కాంగ్రెస్ పార్టీతో మాకు పోటీనా? అని ప్రశ్నించారు. 'పదేండ్ల కాంగ్రెస్ పాలనపై చర్చ అనేందుకు ఆనాడు నువ్వు ఆ పార్టీలో ఏడున్నవో చెప్పాలి. అప్పుడు నువ్వు తెలుగుదేశం పార్టీలో ఉండి పొద్దుగాల లేస్తే కాంగ్రెస్ పార్టీని తిట్టావ్. సోనియాగాంధీని బలిదేవత అన్న నీకు ఈ రోజు మాట్లాడే హక్కు ఎక్కడిదో చెప్పాలి. కావాలంటే ఆనాడు కాంగ్రెస్ పార్టీలో ఉన్న ముఖ్యమంత్రులు, పీసీసీ అధ్యక్షులతో చర్చ చేయడానికి సిద్ధంగా ఉన్నాం' అని రేవంత్‌నుద్దేశించి హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. రేవంత్ పెడితే పెండ్లి.. పెట్టకుంటే చావుకోరే టైప్ అని చురకలంటించారు. పక్కనే ఉన్న ఛత్తీస్‌గఢ్‌లో పదేండ్లుగా అధికారంలో ఉండి కూడా ఏం చేయనోళ్లు, తెలంగాణలో చేస్తామంటున్నారని కాంగ్రెస్‌పై మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ, రేవంత్‌రెడ్డి మాటలు నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు.

> మాటలు, మూటలు, ముఠాలు, మంటలు.. ఇది కాంగ్రెస్ పార్టీ సంస్కృతి. కాంగ్రెస్ గురించి ఒక్క మాటలో చెప్పాలంటే మాయమాటలు– ఓట్ల కోసం ఎన్ని అబద్ధాలైనా చెప్తారు, మూటలు –కర్ణాటక నుంచి డబ్బు సంచులు తెచ్చి తెలంగాణ ఓట్లు కొంటారట, ముఠాలు– కొట్లాడుకునే గ్రూపుల సంస్కృతి.. ఒకని కాలు పట్టి ఒకడు వాళ్లే గుంజుకుంటరు, మంటలు–ముఖ్యమంత్రి పదవి దించడానికి మతంమంటలు పెడుతారు. – మంత్రి హరీశ్‌రావు

డిపాజిట్లు దక్కించుకొనే కమిటీ వేయ్!

సొంత రాష్ట్రం హిమాచల్‌ప్రదేశ్‌లో బీజేపీని గెలిపించుకోని జేపీ నడ్డా.. తెలంగాణకు వచ్చి ప్రగల్భాలు పలుకుతున్నారని మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. 'జేపీ నడ్డా.. తెలంగాణ కేసీఆర్ అడ్డా అని గుర్తుపెట్టుకో' అని హెచ్చరించారు. తెలంగాణలో బీజేపీ డకౌట్ ఖాయమని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో బీజేపీ ఒక్క చోటే గెలిచిందని, ఈ సారి ఆ ఒక్కటి కూడా రాదని అన్నారు. ఏవేవో కమిటీలు వేస్తున్న నడ్డా.. డిపాజిట్ దక్కించుకొనే కమిటీ వేసుకో అని చురకలంటించారు. నడ్డా వేసిన చేరికల కమిటీ అట్టర్ ఫ్లాప్ అయిందని ఎద్దేవా చేవారు. 'బీజేపీ నుంచి బీఎల్ సంతోష్ అనే ఆయన వచ్చి ఈ రాష్ట్రంలో హంగ్ వస్తది అంటుండు. మిస్టర్ సంతోష్.. ఈ రాష్ట్రంలో హంగ్ కాదు.. బీఆర్ఎస్ హ్యాట్రిక్ కొడ్తది' అని స్పష్టం చేశారు. గుజరాత్ కంటే తెలంగాణ పాలన నూరుపాళ్లు నయమని పేర్కొన్నారు. గుజరాత్‌లో రూ.600 పింఛన్ ఇస్తే, తెలంగాణలో కేసీఆర్ రూ.2వేలు ఇస్తున్నారని చెప్పారు. గుజరాత్‌లో వ్యవసాయానికి కరెంట్ ఇచ్చి బిల్లులు వసూలు చేస్తుంటే.. తెలంగాణలో రూపాయి బిల్లు లేకుండా కేసీఆర్ 24 గంటల ఉచిత నాణ్యమైన కరెంట్ అందిస్తున్నారని తెలిపారు. మరోసారి సీఎంగా కేసీఆర్‌ను గెలిపించుకొని రాష్ట్రాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకుపోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీ వెంకటేశ్ నేతకాని, ఎమ్మెల్సీ దండె విఠల్, ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్, మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు, బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లో కేసీఆర్

తెలంగాణ రాష్ట్రంలోని ప్రజల గుండెల్లో కేసీఆర్ ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ విజయం సాధిస్తారని మంత్రి హరీశ్‌రావు ధీమా వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పార్టీకి 30 స్థానాల్లో అభ్యర్థులే లేరని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రతిపక్ష హోదా తెచ్చుకోవటమే ఎక్కువని జోస్యం చెప్పారు. సీఎం కేసీఆర్ గత ఎన్నికల్లో 80 సీట్లు సాధించారని.. వచ్చే ఎన్నికల్లో వంద సీట్లు సాధించి హ్యాట్రిక్ సీఎం అవుతారని తెలిపారు. సీఎం కేసీఆర్ రైతుబంధు, పింఛన్ డబ్బులను పెంచే ఆలోచన చేస్తున్నట్టు వెల్లడించారు. త్వరలోనే బ్రహ్మాండమైన మ్యానిఫెస్టో విడుదల చేస్తారని చెప్పారు. జహీరాబాద్ నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్ పార్టీ తప్పుడు మాటలను నమ్మవద్దని హితవు పలికారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మాణిక్‌రావు పక్కా లోకల్ అని, ఈ నియోజకవర్గం ఇంకా అభివృద్ధి చెందాలంటే ఆయననే గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీ బీబీ పాటిల్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మాణిక్‌రావు, జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్లు దేవిప్రసాద్, మఠం భిక్షపతి, నరోత్తమ్ తదితరులు పాల్గొన్నారు.

వెస్టిండీస్‌లా కాంగ్రెస్ పరిస్థితి!

ఇప్పుడు క్రికెట్ వరల్డ్ కప్ నడస్తున్న దృష్ట్యా.. క్రికెట్ భాషలో చెప్పాలంటే.. రాష్ట్రంలో ఎన్నికలు ఏ రోజు జరిగినా బీజేపీ డకౌట్, కాంగ్రెస్ రనౌట్ ఖాయమని, కేసీఆర్ సెంచరీ కొట్టడం పక్కా అని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. కాంగ్రెసోళ్లు లేని రన్ కోసం ఉరికి రనౌట్ అయితే, బీజేపీ వాళ్లు ఇప్పుడున్న ఒక్క ఎమ్మెల్యే సీటు కూడా గెలవక డకౌట్ అవుతారని ఎద్దేవా చేశారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా 100 సీట్లతో కేసీఆర్ సెంచరీ కొడతారని ధీమా వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పార్టీ పరిస్థితి వెస్టిండీస్ టీమ్‌లా తయారైందని ఎద్దేవా చేశారు. గతంలో ఎప్పుడు వరల్డ్‌కప్ వచ్చినా ఆ టీమే గెలుస్తుండే కానీ ఇప్పుడు వరల్డ్ కప్ ఆడేందుకు అర్హత కూడా సాధించలేకపోయిందని అన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ పరిస్థితి కూడా అలాగే ఉన్నదని ఎద్దేవా చేశారు. తెలంగాణలో కనీసం ప్రతిపక్ష హోదా అయినా దక్కించుకోవాలని కాంగ్రెస్‌కు సవాల్ విసిరారు. 'కర్ణాటకలో లంచాలు తీసుకున్న అవినీతి సొమ్ము తెచ్చి తెలంగాణలో పంచి గెలువాలని పగటి కలలు కంటున్నరు. బిడ్డా ఇది తెలంగాణ.. ఉద్యమాల గడ్డ.. నీ పైసలు ఇక్కడ నడవయ్' అని కాంగ్రెస్‌పై మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు.

23నే దసరా సెలవు

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 23నే దసరా సెలవును ఖరారు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తొలుత ఈ నెల 24న విజయదశమి సెలవును ఖరారు చేసింది. ఇటీవలే తెలంగాణ రాష్ట్ర విద్వత్సభ దసరాను 23నే నిర్వహించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ఆ మేరకు 24న సెలవును 23కు మార్చుతూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. 24వ తేదీ కూడా సెలవు దినమేనని ఉత్తర్వుల్లో పేర్కొన్నది.

మా అమ్మను హైదరాబాద్ చేర్చండి

- నటి సరళకుమారి కుమార్తె వేడుకోలు
- సిక్కిం పర్యటనకు వెళ్లి వరదల్లో చిక్కుకుపోయిన సీనియర్ నటి

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): సిక్కిం వరదల్లో చిక్కుకుపోయిన సీనియర్ నటి, కూచిపూడి డ్యాన్సర్ సరళకుమారి సురక్షితంగా ఉన్నట్టు ఆమె కుమార్తె నబిత శనివారం పేర్కొన్నారు. 'లాచెన్' ప్రాంతంలో తన తల్లి క్షేమంగా ఉన్నట్టు సమాచారం అందిందని 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. ఆమెను అక్కడి నుంచి హైదరాబాద్ తీసుకొచ్చేందుకు ప్రభుత్వ సాయాన్ని అభ్యర్థించారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, డీజీపీ అంజనీకుమార్ స్పందించి తమ తల్లిని క్షేమంగా తెలంగాణకు తీసుకువచ్చేలా సాయం చేయాలని వేడుకొన్నారు. హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో నివాసం ఉంటున్న సరళకుమారి 2న హైదరాబాద్ నుంచి తన స్నేహితులతో కలిసి సిక్కిం పర్యటనకు వెళ్లారు. అనుకోకుండా అక్కడ భారీ వరదలు సంభవించడంతో శనివారం వరకూ ఆమె ఆచూకీ లభ్యం కాలేదు. అమెరికాలో ఉంటున్న ఆమె కుమార్తె నబిత తల్లిజాడ తెలుసుకొన్నారు. ఆమె సురక్షితంగా ఉన్నట్టు తెలుసుకుని ఊపిరి పీల్చుకున్నారు. 1983లో మిస్ ఏపీగా ఎంపికైన సరళకుమారి.. ఆ తర్వాత సినీ రంగంలోకి అడుగుపెట్టారు. దానవీరశూరకర్ణ, సంఘర్షణ వంటి సినిమాల్లో నటించారు.

కార్మికుల స్వేదం.. సింగరేణి విజయం

- నాడు సంస్థ లాభాల్లో వాటా 16%, ఇప్పుడు 32%
- సమైక్య రాష్ట్రంలో కార్మికులకు దక్కింది స్వల్పమే
- తెలంగాణ ఏర్పాటు తర్వాత భారీగా పెరిగిన వాటా
- 2013-14లో కార్మికులకు చెల్లించింది రూ.83 కోట్లే
- ఇప్పుడు చెల్లిస్తున్న మొత్తం రూ.711 కోట్ల పైమాటే
- తొమ్మిదేండ్లలోనే కార్మికుల లాభాల వాటా 700% వృద్ధి
- సీఎం కేసీఆర్ మార్గదర్శనంలో ఆర్థికంగా సింగరేణి బలోపేతం

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): సమైక్య రాష్ట్రంలో అడుగడుగునా సమ్మెల వల్ల నష్టాల్లో నడిచిన సింగరేణి సంస్థలో కార్మికులు పడ్డ బాధలన్నీ సొంత రాష్ట్రంలో పటాపంచలయ్యాయి. అప్పుడు ఆర్థిక దిగ్బంధనంలో నడిచిన సంస్థ నేడు కార్మికుల స్వేదంతో ఆర్థికంగా బలోపేతమై వ్యాపారంలో తలెత్తుకుని పరుగులు తీస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ విడిపోయి ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించడం వల్లనే సింగరేణి కార్మికుల బంగారు భవిష్యత్తుకు పునాది పడింది. అందుకు నిదర్శనం గత పదేండ్ల గణాంకాలే.

- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సింగరేణి అంటే ఎప్పుడూ సమ్మెలు, నష్టాలే.
- ఇప్పుడు స్వరాష్ట్రంలో ఆర్థికంగా పరిపుష్టమైన సింగరేణి అంటే సిరుల పంట. తెలంగాణ కొంగు బంగారం.
- సమైక్య పాలకులు అధికారంలో ఉన్నప్పుడు *2008-09*లో సింగరేణి లాభాల్లో కార్మికులకు ఇచ్చిన వాటా కేవలం *16* శాతమే.
- ఇప్పుడు సొంత రాష్ట్రంలో ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పాలనలో సింగరేణి కార్మికులకు లాభాల్లో ఇస్తున్న వాటా *32* శాతం.
- *2013-14*లో సింగరేణికి వచ్చిన లాభం (పన్నులు మినహాయించి) రూ. *418.74* కోట్లు. అందులో కార్మికులకు పంచింది కేవలం రూ. *83.75* కోట్లు.
- *2022-23*లో సింగరేణికి వచ్చిన లాభం (పన్నులు మినహాయించి) రూ.*2,222.46* కోట్లు. అందులో కార్మికులకు ఇస్తున్నది రూ.*711.19* కోట్లు

ఇప్పుడు రెట్టింపు శాతం వాటా

సమైక్య పాలకుల హయాంలో 2008-09 నుంచి 2010-11 వరకు వరుసగా మూడేండ్లపాటు సింగరేణి లాభాల్లో కార్మికులకు ఇచ్చిన వాటా కేవలం 16 శాతమే. నాటి నుంచి అరకొర వాటాతో సరిపెట్టుకున్న కార్మికులకు 2013-14లో ప్రత్యేక రాష్ట్రం ఏర్పడే టప్పుడు కూడా సంస్థ లాభాల్లో కార్మికులకు 20 శాతం వాటాను మాత్రమే ప్రకటించారు. కానీ.. స్వరాష్ట్రంలో సింగరేణి లాభాల్లో కార్మికులకు ఇచ్చే వాటా ఎన్నడూ 21 శాతం కంటే తగ్గలేదు. కొవిడ్ సంక్షోభంతోపాటు ఇతర కారణాల వల్ల సింగరేణికి ఒకట్రెండు సార్లు తక్కువ లాభాలు వచ్చినా సీఎం కేసీఆర్ మాత్రం కార్మికుల వాటా శాతాన్ని క్రమంగా పెంచుతూనే వచ్చారు. 2022-23లో కార్మికులకు సంస్థ లాభాల్లో ఏకంగా 32 శాతం వాటాను ప్రకటించారు. దీన్ని బట్టే సింగరేణి కార్మికులపై సీఎం కేసీఆర్‌కు ఎంత ఆప్యాయత ఉన్నదో అర్థం చేసుకోవచు.

గతంలో రూ.100 కోట్లు దాటిందే లేదు

సమైక్య రాష్ట్రంలో సింగరేణి లాభాల నుంచి కార్మికులకు ఇచ్చిన మొత్తం వాటా ఎన్నడూ రూ.100 కోట్లు దాటిందే లేదు. 2008-09లో సింగరేణి లాభాల నుంచి కార్మికులకు 16 వాటా ప్రకటించిన అప్పటి ప్రభుత్వం.. మొత్తంగా వారికి చెల్లించిది మాత్రం రూ.21.25 కోట్లే. తెలంగాణ ఏర్పడిన 2013-14లో కూడా పేరుకు 20 శాతం వాటాను ప్రకటించినప్పటికీ కార్మికులకు పంచింది రూ.83.75 కోట్లు మాత్రమే.

తెలంగాణ ఏర్పడిన తొలి ఏడాదిలోనే కార్మికులకు రూ.102.99 కోట్లు చెల్లింపు

స్వరాష్ట్ర సాధన కోసం ఉద్యమం వెంట నడిచిన సింగరేణి కార్మికుల కష్టాలను దృష్టిలో పెట్టుకుని సీఎం కేసీఆర్ ఎంతో ఉదారతతో వ్యవహరించారు. తొలి సంవత్సరం (2014-15)లోనే సింగరేణి లాభాల నుంచి కార్మికులకు 21 శాతం వాటాను ప్రకటించడంతో తొలిసారి అది మూడంకెల మార్కు దాటింది. నాడు కార్మికులకు ఏకంగా రూ.102.99 కోట్లు వాటాగా చెల్లించారు. నాటి నుంచి కేవలం రెండుసార్లు మాత్రమే కార్మికులకు రూ.100 కోట్లలోపు వాటా చెల్లించారు. కొవిడ్ సంక్షోభం, ఇతర కారణాల వల్ల సింగరేణి లాభాలు గణనీయంగా పడిపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. అయినప్పటికీ సింగరేణి లాభాల్లో కార్మికుల వాటా శాతాన్ని సీఎం కేసీఆర్ ప్రభుత్వం ఎన్నడూ తగ్గించకపోగా ఎప్పటికప్పుడు పెంచుతూనే వచ్చింది. అలా 2016-17లో 25 శాతం, 2020-21లో 30 శాతం వాటాను పంచిన ప్రభుత్వం.. 2022-23లో ఏకంగా 32 శాతం వాటాను ప్రకటించింది. దీంతో ఈసారి కార్మికులకు మొత్తం రూ.711.19 కోట్లు చెల్లించనున్నారు.

అప్పుడు నాలుగింతలు.. ఇప్పుడు ఏడింతలు

2008-09లో సింగరేణి లాభాల నుంచి కార్మికులకు వాటాగా రూ.21.25 కోట్లు చెల్లించారు. ఈ వాటా 2013-14 నాటికి 4 రెట్లు పెరిగి రూ.83.75 కోట్లకు చేరింది. కానీ, తెలంగాణ ఆవిర్భవించాక తొలి ఏడాది (2014-15)లో కార్మికులకు లాభాల వాటాగా రూ.102.99 కోట్లు చెల్లించిన సింగరేణి సంస్థ.. 2022-23 లాభాల్లో మొత్తం రూ.711.19 కోట్లు చెల్లించనున్నది. అంటే గత తొమ్మిదేండ్లలో కార్మికుల లాభాల వాటా ఏకంగా 7 రెట్లు పెరిగింది. సమైక్య పాలకుల హయాంలో సింగరేణి లాభాల నుంచి వాటాగా ఒక్కో కార్మికుడికి రూ.10 వేలు మించి దక్కేవి కాదు. కానీ, ఇప్పుడు స్వరాష్ట్రంలో ఒక్కో కార్మికుడికి సగటున ఏకంగా రూ.1.65 లక్షలకుపైగా చెల్లిస్తుండటం గమనార్హం.

సీఎం కేసీఆర్ మార్గదర్శనంలో ఆర్థికంగా సింగరేణి పరిపుష్టం

సింగరేణి సంస్థ పట్ల, కార్మికుల పట్ల తనకున్న ప్రేమాభిమానాలను సీఎం కేసీఆర్ మొదటి నుంచే చాటుకుంటున్నారు. అందులో భాగంగా సింగరేణి కార్మికుల సంక్షేమానికి, ఆ సంస్థ అభివృద్ధికి అనేక చర్యలు చేపట్టారు. సమర్థుడైన ఐఏఎస్ అధికారి ఎన్ శ్రీధర్ సారథ్యంలో సింగరేణి అభివృద్ధి పథంలో దూసుకుపోయేలా మార్గదర్శనం చేస్తున్నారు. అరకొర జీతాలు, కాలే కడుపులతో అలమటిస్తున్న కార్మికుల కష్టాలను అర్థం చేసుకుని, ఎప్పటికప్పుడు పరిష్కరించారు. ఫలితంగా కార్మికులు సమ్మెబాటను వీడి బొగ్గు బాయిల బాట పట్టడంతో సింగరేణి లాభాల్లో పెరుగుదల మొదలైంది. ఇదే సమయంలో సంస్థ కూడా బొగ్గు తవ్వకాలను మరింత విస్తృతం చేయడంతోపాటు విభిన్న వ్యాపారాలను చేపట్టడం.. థర్మల్, సౌర విద్యుత్తు ఉత్పత్తిలోకి ప్రవేశించడంతో లాభాలు మరింత పెరిగాయి. దీంతో 2008-09లో కేవలం రూ.132.83 కోట్లుగా ఉన్న సింగరేణి లాభాలు 2022-23లో ఏకంగా రూ.2,222.46 కోట్లకు చేరాయి.

అప్పట్లో సంస్థ లాభాల కంటే ఇప్పుడు కార్మికులకు పంచేదే ఎక్కువ

సమైక్య పాలకుల హయాంలో సింగరేణికి వచ్చే లాభాలు చాలా తక్కువగా ఉండేవి. 2013-14లో రూ.418.74 కోట్ల లాభం రావడమే అప్పట్లో ఘన చరిత్ర. దీని కంటే స్వరాష్ట్రంలో లాభాల వాటాగా సింగరేణి కార్మికులకు పంచుతున్న మొత్తమే చాలా అధికంగా ఉండటం గమనార్హం. 2018-19లో రూ.1,763.66 కోట్ల లాభాలను గడించిన సింగరేణి.. అందులో కార్మికులకు 28 వాతం వాటాగా మొత్తం రూ.493.82 కోట్లు చెల్లించింది. ఇప్పుడు ఏకంగా రూ.711.19 కోట్లు చెల్లించనున్నది. ఇది 2011-12లో సింగరేణికి వచ్చిన లాభాల కంటే రెట్టింపు.

సీఎం మార్గదర్శనం, కార్మికుల శ్రమే కారణం

> సీఎం కేసీఆర్‌కు మొదటి నుంచే సింగరేణి అంటే ఎంతో అభిమానం, ఆప్యాయత. అందుకే స్వరాష్ట్ర ఆవిర్భావం నుంచే సింగరేణి అభివృద్ధి, కార్మికుల సంక్షేమంపై ఎప్పటికప్పుడు మార్గదర్శనం చేస్తూనే ఉన్నారు. కార్మికుల కష్టాలను పరిష్కరించి, వారికి ఆర్థికంగా అండగా నిలిచేందుకు అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇదే సమయంలో కార్మికులు 'మా రాష్ట్రం.. మా సంస్థ' అనుకొని క్రమశిక్షణతో వ్యవహరించడం, తీవ్రంగా శ్రమించడంతో సింగరేణి పరిస్థితి మెరుగుపడింది. దీనికి తోడు కొత్త వ్యాపారాల్లోకి దిగడంతో ఆర్థికంగా సంస్థ మరింత బలపడింది. అందుకే రూ.*11* వేలకోట్ల టర్నోవర్ రూ. *32* వేలకోట్ల టర్నోవర్‌ను అవలీలగా అధిగమించగలిగాం. రానున్న ఐదేండ్లలో మరింత పకడ్బందీగా ముందుకుసాగి రూ.*50* వేలకోట్ల టర్నోవర్‌ను చేరుకుంటాం. ఈ నేపథ్యంలోనే సీఎం కేసీఆర్ ఉదారతతో వ్యవహరిస్తున్నారు. సింగరేణి లాభాల్లో ఈసారి కార్మికులకు *32* శాతం వాటా చెల్లించాలని నిర్ణయించారు. దీంతో సంస్థ చరిత్రలో మునుపెన్నడూ లేనివిధంగా కార్మికులకు మొత్తం రూ.*711.19* కోట్లు చెల్లిస్తున్నాం. దీనికంతటికీ సీఎం కేసీఆర్ మార్గదర్శనం, కార్మికుల శ్రమే కారణం. ఇదే ఒరవడితో కార్మికులు ముందుకు సాగాలని, ఆర్థికంగా సింగరేణిని దేశంలోనే అత్యంత బలమైన ప్రభుత్వరంగ సంస్థగా నిలబెట్టాలని ఆశిస్తున్నాను. - ఎన్ శ్రీధర్, సింగరేణి సీఎండీ

సమైక్య రాష్ట్రంలో సింగరేణి లాభాలు.. కార్మికులకు పంచిన వాటా

సంవత్సరం	మొత్తం లాభం రూ.కోట్లలో (పన్నులు మినహాయించి)	లాభంలో కార్మికులకు ప్రకటించిన వాటా శాతం	లాభంలో కార్మికుల వాటాగా చెల్లించిన మొత్తం (రూ.కోట్లలో)
2008-09	132.83	16	21.25
2009-10	268.00	16	42.88
2010-11	351.10	16	56.18
2011-12	359.00	17	61.03
2012-13	401.00	18	72.18
2013-14	418.74	20	83.75

స్వరాష్ట్రంలో సింగరేణి లాభాలు.. కార్మికులకు పంచిన వాటా

సంవత్సరం	మొత్తం లాభం రూ.కోట్లలో (పన్నులు మినహాయించి)	లాభంలో కార్మికులకు ప్రకటించిన వాటా శాతం	లాభంలో కార్మికుల వాటాగా చెల్లించిన మొత్తం (రూ.కోట్లలో)
2014-15	490.44	21	102.99
2015-16	1,066.13	23	245.21
2016-17	395.38	25	98.85
2017-18	1,212.75	27	327.44
2018-19	1,763.66	28	493.82
2019-20	993.86	28	278.28
2020-21	272.64	29	79.07
2021-22	1,227.04	30	368.11
2022-23	2,222.46	32